క్లుప్తంగా

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శేఖర్‌రెడ్డి



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

కొత్తూరు: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండలంలోని సిద్దాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత ఎల్లారం శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ బడుల్లో ఎలాంటి ఫీజులు లేకుండా విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజితమ్మ, రఘుపాల్, పాషా, సరిత, నాయకులు శేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, గణేశ్, జంగయ్య, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడికి పంపించాలి



హిమాయత్‌నగర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే నాణ్యమైన విద్య అందుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కవిత, అమ్డాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రేణుక అన్నారు. శనివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్, అమ్డాపూర్ గ్రామాల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు తదితరులు కలిసి పెద్దఎత్తున బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిమాయత్‌నగర్‌లో ఇంటింటి ప్రచారంలో వారు పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు ముద్దు, ప్రైవేటు పాఠశాలలు వద్దు అంటూ తల్లిదండ్రులకు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత భోజనంతో పాటు పాఠ్య పుస్తకాలు, దుస్తులు అన్ని సదుపాయాలను కల్పిస్తుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. అందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి పేదరిక నిర్మూలనకు, విద్యా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని హెచ్‌ఎం భాగ్యమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్(కుంటబడి) బాలుర పాఠశాల హెచ్‌ఎం ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పటేల్‌రోడ్డు, రాంనగర్ కాలనీ, రైల్వే స్టేషన్, చటాన్‌పల్లిలో ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు అందిస్తుందన్నారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు తల్లితండ్రులు బాటలు వేయాలన్నారు. ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మనోహర్, శ్రీలక్ష్మి, ప్రమీల, రాజశేఖర్, అరుంధతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలతో పాటు అర్హులైన వారికి ప్రమోషన్లను కల్పించేందుకు ఇచ్చిన ఉత్తర్వుల్లో రంగారెడ్డి జిల్లా లేకపోవడంతో ఇక్కడి ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) మండల ప్రధాన కార్యదర్శి రవికుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల ఉత్తర్వులపై రవికుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చాలా కాలంగా జిల్లాలో అక్రమంగా చొరబడి విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి వారిని వెనక్కి పంపించాలన్నారు. బదిలీలు లేకపోవడంతో మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ప్రభుత్వం జిల్లాపై ప్రత్యేక దృష్టిపెట్టి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

నిరుపయోగంగా రైతు బజార్

- రోడ్లపైనే కూరగాయల విక్రయాలు
- లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- అవగాహన కల్పించని అధికారులు, ప్రజాప్రతినిధులు

చేవెళ్ల: మండల కేంద్రంలో ప్రజలు, రైతులకు ఉపయోగపడుతుందని లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి రైతు బజార్ నిర్మించినా వ్యాపారులు రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తుండడంతో నిరుపయోగంగా మారింది. దీంతో రైతు బజార్ స్థలంలో పక్కనే ఉన్న కాలనీవాసులు చెత్త చెదారాలు వేస్తుండటంతో అది డంపింగ్‌యార్డుగా కనిపిస్తోంది. రోడ్లపై కూరగాయలు అమ్మకుండా పాలకవర్గం, అధికారులు చర్యలు తీసుకుంటేనే రైతుబజార్ వినియోగంలోకి వస్తుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

మండల కేంద్రంలో అన్ని హంగులతో నిర్మించిన రైతుబజార్‌ను వినియోగించుకోకపోవడంతో వెలవెలబోతోంది. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన ఈ రైతుబజార్ నాలుగునెలలు కూడా సక్రమంగా నడవలేదు. చేవెళ్లలో కూరగాయలు కావాలంటే ప్రధాన రోడ్ల వెంట ఉండే దుకాణాలు రైతు బజార్‌లుగా మారాయి. రైతు బజార్‌లో దాదాపు 40 మంది విక్రయదారులు కూరగాయలు విక్రయించుకునేందుకు వీలుగా షెడ్‌లు, రోడ్లు ఏర్పాటు చేశారు. రైతుబజార్ షెడ్‌లు బోసిపోయి నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. కరోనా లాక్‌డౌన్ సమయంలో మాత్రం



రైతు బజారులో నిరుపయోగంగా ఉన్న షెడ్‌లు

బయట దుకాణాలు బంద్ చేసి కేవలం రైతు బజార్‌లోనే కూరగాయల విక్రయాలు చేయటంతో రైతు బజార్ కళకళలాడింది. ఆ తరువాత మళ్లీ యాథావిధిగా రోడ్లపై కూరగాయలు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి ఈ రైతు బజారును ఉపయోగించుకునేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకునే వారు లేక నిరుపయోగం

మండల కేంద్రంలో ప్రజల కోసం నిర్మించిన రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు స్థానిక నాయకులు ఎవరూ ముందుకు రావటం లేదు. మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, మార్కెట్ అధికారులు పట్టించుకోకపోవటంతో ఇలా ప్రజాధనంతో నిర్మించిన రైతుబజార్ వృథాగా మారుతోంది. స్థానిక



చెత్త చెదారాలతో డంపింగ్‌యార్డులా రైతు బజార్

నాయకుల అండదండలతోనే చిరువ్యాపారులు దర్జాగా రోడ్లపైనే అమ్మకాలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉపయోగించుకునేలా చూడాలి



లక్షల రూపాయలు పెట్టి నిర్మించిన రైతు బజార్‌ను ఉపయోగించుకోకపోవటంతో నిరుపయోగంగా మారుతోంది. కూరగాయలు విక్రయించే చిరువ్యాపారులు అందరూ రైతు బజారును ఉపయోగించుకునేలా చూడాలి. చిరువ్యాపారులు రోడ్ల పక్కనే దుకాణాలు పెట్టి విక్రయిస్తున్నారు. రైతు బజారు ఉపయోగించుకునేలా వారికి అవగాహన కల్పించాలి. కూరగాయలు అంటే రైతు బజారులోనే ఉంటాయనే విధంగా చర్యలు ఉండాలి. అధికారులు, నాయకులు స్పందించి రైతు బజారును ఉపయోగించుకునేలా చూడాలని కోరుతున్నాం.

– శ్రీనివాస్, రైతు, చేవెళ్ల

చర్యలు తీసుకోవాలి



చేవెళ్ల అభివృద్ధిని కాంక్షించే విధంగా మండలంలోని నాయకులందరూ కలిసికట్టుగా ఇలాంటి వాటిని ఉపయోగించుకునేలా నిర్ణయాలు తీసుకోవాలి. రైతు బజారును నిరుపయోగంగా వదిలేయడంతో ఇప్పుడు అది డంపింగ్‌యార్డులా మారుతోంది. ఇలాగే వదిలేస్తే ఎందుకు ఉపయోగం లేకుండా పోతుంది. అధికారులు, మండల నాయకులు కలిసి ఇలాంటి వాటిపై సరైన నిర్ణయం తీసుకోవాలి.

– అనంత్‌రెడ్డి, బీజేపీ మండల నాయకుడు

రైతులను ఆదుకుంటాం

షాబాద్: ఆపదలో ఉన్న రైతులను ఆదుకునేందుకు తమవంతు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు కురుమ సంఘం మండల అధ్యక్షుడు మద్దూరి పాండు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో శుక్రవారం రెండు పాడి ఆవులు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న కురుమ సంఘం సభ్యులు బాధిత రైతు పొట్టిగారి నర్సింహులుకు రూ.60వేల ఆర్థికసాయం అందజేశారు. వర్షాకాలంలో రైతులు తమ పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమలో మాజీ సర్పంచ్‌లు చందిప్ప జంగయ్య, బోకుల లింగం, కురుమ సంఘం మండల ఉపాధ్యక్షుడు కారు చెన్నయ్య, మన్‌మర్రి



పాడి రైతుకు నగదు అందజేస్తున్న సంఘం అధ్యక్షుడు పాండు, సభ్యులు

మాజీ ఉపసర్పంచ్ గోపాల్, సంఘం సభ్యులు బండ కృష్ణ, నారాయణ, నరేందర్, శ్రీకాంత్, నాగేశ్, కుమార్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశం పురోగతి

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: గ్రామాలు అభివృద్ధి బాటలో సాగితేనే దేశం మరింత పురోగతి సాధిస్తుందని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వైఎం తండా పంచాయతీలో ఆయన శనివారం పలువురు నాయకులతో కలిసి సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. తండాలో మండల పరిషత్ నిధులు రూ.2లక్షలతో పనులు చేపట్టామన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇప్పటికే మండల పరిషత్ నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. విడతల వారీగా నిధుల లభ్యతను బట్టి అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రత్యేకాధికారులు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అంతేకాకుండా దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా శానిటేషన్‌ను పటిష్టంగా నిర్వహించాలన్నారు. నీటి సరఫరా చేసే ట్యాంకులు, సంపులను నిర్ణీత కాలవ్యవధిలో శుభ్రపరచాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు అనారోగ్యాలకు గురైతే నిర్లక్ష్యం చేయకుండా చికిత్సలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌నాయక్, రవినాయక్, దశరథ్ నాయక్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

మృగశిర కార్తె.. చేపలకు భలే డిమాండ్



చేవెళ్లలో రోడ్డుపక్కన చేపల దుకాణాలు



అజీజ్‌నగర్‌లో చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

చేవెళ్ల: మృగశిర కార్తె సందర్భంగా శనివారం చేపలకు భలే డిమాండ్ పలికింది. ఉదయం నుంచే జనాలు చేపల కొనుగోలుకు క్యూ కట్టారు. మార్కెట్లన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. దీంతో ఒక్కసారిగా బొప్పలు, బంగారు తీగ, కొర్రమట్టలు, రవ్వలు, బొత్స తదితర చేపలకు డిమాండ్ పెరిగింది. కిలో రూ.150 నుంచి 300 వరకు విక్రయించారు. చేవెళ్ల మండలంలో చేపల వ్యాపారం లేదు. దీంతో ఇతర ప్రాంతాలకు చెందిన చేపల వ్యాపారులు వారం వారం చేవెళ్లకు వచ్చి చేపలు విక్రయిస్తూ ఉంటారు. ఇందు లో భాగంగానే మృగశిర కార్తె సందర్భంగా ఈ ప్రాంతంలో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని చిరువ్యాపారులు ఎక్కువ మంది చేపలు అమ్మేందుకు వచ్చి ప్రధాన రోడ్డు పక్కన దుకాణాలు పెట్టారు. ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి కొనుగోలు చేశారు.

మొయినాబాద్‌రూరల్: మృగశిర కార్తె శనివారం కావడంతో అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ గ్రామాల్లో చేపల కోసం ప్రజలు ఎగబడ్డారు. ముఖ్యంగా ఇటు గండిపేట చెరువు అజీజ్‌నగర్, అటూ హిమయత్‌నగర్ గ్రామాల్లో చేపల అమ్మకాలు భారీగా కొనసాగాయి.

రాజీమార్గమే రాజమార్గం

- చేవెళ్ల కోర్టు సీనియర్ జడ్జి దశరథరామయ్య
- 1833 కేసుల పరిష్కారం, రూ.10,33,080 జరిమానాలు

చేవెళ్ల: కోర్టులలో ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరువర్గాలు రాజీమార్గం ద్వారా రాజీ చేసుకోవటానికి మించిన పరిష్కారం మరొకటి ఉండదని చేవెళ్ల కోర్టు సీనియర్ జడ్జి కె.దశరథరామయ్య అన్నారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో శనివారం నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో దశరథరామయ్యతో పాటు జూనియర్ జడ్జి కిరణ్‌కుమార్, రిటైర్డు జడ్జి సాంబశివరావుల ఆధ్వర్యంలో చేవెళ్ల కోర్టు పరిధిలోకి వచ్చే కేసులు, ట్రాఫిక్ పోలీస్ కేసులను పరిష్కరించారు. ఈలోక్ అదాలత్ ద్వారా మొత్తం 1833 కేసులను పరిష్కరించటంతో పాటు 10,33,080 రూపాయల జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. క్షణికావేశాల్లో ఎంతో మంది తాము చేసిన తప్పులు, నేరాలకు కేసులు నమోదు చేసుకొని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతుంటారన్నారు. అలాంటి పెండింగ్ కేసులను పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పించాలనే ఆలోచనతో లోక్ అదాలత్‌లను తీసుకొచ్చామన్నారు. తమ తప్పులను తెలుసుకొని రాజీ చేసుకునేందుకు ముందుకు వచ్చే ఇరువర్గాలకు కేసులను పూర్తిగా అక్కడిక్కడే పరిష్కరిస్తామన్నారు. ట్రాఫిక్ పోలీస్ కేసులు, మద్యం సేవించి వాహనాలు నడిపించి పట్టుబడిన కేసులు ఇలా అనేక రకాల రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల కోర్టు ఏపీపీ మయూరి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యానందం, ఉపాధ్యాక్షుడు గౌతమ్‌రెడ్డి, చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, చేవెళ్ల ఇన్‌స్పెక్టర్లు లక్ష్మారెడ్డి, ఎండీ అభివుల్లాఖాన్, కాంతారెడ్డి, వీరబాబు, ట్రాఫిక్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ జడ్జి దశరథరామయ్య, తదితరులు

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మ గుట్ట హనుమాన్ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకీసేవలో భక్తుల భజనలు, శ్రీరామనామ కీర్తనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన మంచిరేవుల అశోక్, చెన్నయ్య ఆలయానికి ఐదు టేబుళ్లను అందజేశారు. అనంతరం యశోద, వెంకటేశ్‌గౌడ్ దంపతుల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు పులిమామడి శ్రీశైలం గౌడ్ పూలమాలలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్, రఘుగౌడ్, రమేశ్, రఘునందన్‌రెడ్డి, లక్ష్మణ్, కిషన్‌నాయక్, రాఘువేందర్, నారాయణ, కృష్ణయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణచారి, శంకర్‌గౌడ్, బచ్చన్న, యాదగిరి, పద్మావెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

బీఆర్‌ఎస్ పాలనలో ఉపాధ్యాయులకు అన్యాయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: బీఆర్‌ఎస్ పాలకుల నిర్లక్ష్య వైఖరితో ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లాను మినహాయించడంపై డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల తప్పిదంతో 317 జీవో వ్యవహారంలో సాంకేతిక పొరపాట్లు చోటుచేసుకున్నాయన్నారు. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ తప్పుల తడకగా మారిందని ఆరోపించారు. సీనియర్, జూనియర్, ఇతర వర్గాలను రంగారెడ్డి జిల్లాలో పోస్టింగ్‌లు వేయడంతో సమస్యగా మారిందన్నారు. ఉపాధ్యాయ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీధర్‌రెడ్డి, నర్సింలు, కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, సురేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కంది విత్తనాల పంపిణీ

షాబాద్: మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన షెడ్యూల్ కులాల రైతులకు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుగుణమాల ఉత్పత్తిదారుల సంఘం ద్వారా జిల్లా క్రీడా కృషి విజ్ఞాన కేంద్రం వారి సహకారంతో టీడీఆర్‌జీ 59 తెలంగాణ కంది-3 రకం విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ రైతులకు కంది పంట సాగు వివరాలు, సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. మండల పరిధిలోని ముద్దెంగూడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ, రేగడిదోస్వాడ గ్రామాలకు చెందిన రైతులకు విత్తనాలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సుగుణమాల డైరెక్టర్లు కూర వెంకటయ్య, అంజయ్య, భూపతి రాజు, యాదవరెడ్డి, నర్సింహ్మా, శేఖరయ్య, సుదర్శన్, రవీందర్‌రెడ్డి, మాధవరెడ్డి, శంకర్, ప్రవీణ్, మల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి సన్మానం

కొందుర్గు: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీగా ఎన్నికైన నాగర్‌కుంట నవీన్‌రెడ్డిని శనివారం తంగెళ్లపల్లి గ్రామస్తులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు నవీన్‌రెడ్డి స్వగ్రామం మొదళ్లగూడలో కలిసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో ఓటువేసిన కొందుర్గు జెడ్పీటీసీ రాగమ్మకు, ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు. తంగెళ్లపల్లి అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, బాల్‌రాజ్, వెంకటేశ్, శేఖర్, రవిగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, నర్సింలు గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.



నవీన్‌రెడ్డిని సన్మానిస్తున్న తంగెళ్లపల్లి గ్రామస్తులు